సాక్షి అనంతపురం

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.26

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.14, సరాసరి రూ.19 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.6°/21.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

24 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో 24 మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 24 మండలాల పరిధిలో 6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. విడపనకల్లు మండలంలో 22 మి.మీ, వజ్రకరూరు 21, గార్లదిన్నె 20.8, ఆత్మకూరు 18.2, కణేకల్లు 12, పామిడి 11.4, పెద్దవడుగూరు 11.2, ఉరవకొండ 10.2 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంటుంది. జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకు 210 మి.మీ గానూ 19 శాతం అధికంగా 254 మి.మీ నమోదైంది. ఓవరాల్‌గా 20 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. 19 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా, 9 మండలాల్లో సాధారణం, మిగతా 3 మండలాల్లో సాధారణం కన్నా తక్కువగా వర్షాలు కురిశాయి.

'మారథాన్'లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్'లో మంగళవారంలోపు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ సూచించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, సైన్స్ పరిశోధన సంస్థ సంయుక్తంగా అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థుల్లో సైన్స్ పట్ల జిజ్ఞాసను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఆలోచన, విశ్లేషణ, అన్వేషణ సామర్థ్యాలను అభివృద్ధి పరిచి వారినుంచి నూతన ఆవిష్కరణలు తయారు చేసేలా ప్రోత్సహించాలన్నారు. సైన్స్ పరిజ్ఞానాన్ని ప్రదర్శించుకునేందుకు, పెంపొందించుకునేందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ చక్కని అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రతి స్కూల్‌లోనూ కనీసం 50 మంది విద్యార్థులను గ్రూపులుగా విభజించి వారితో ఆవిష్కరణలు చేయించాలని సూచించారు. ఆ విద్యార్థులకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ సభ్యులు సహకరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణను సంప్రదించాలని సూచించారు.

రాగులపాడు గురుకులంలో అక్రమాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: రాగులపాడు గురుకుల పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేస్తామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస రావు తెలిపారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థుల హాజరులో చోటు చేసుకుంటున్న అక్రమాలకు సంబంధించి సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయనపై స్పందించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ అక్రమాలపై రెండు రోజుల్లో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. గత 5 రోజుల నుంచి నమోదు చేసిన విద్యార్థుల హాజరును పరిశీలిస్తామన్నారు. తప్పు చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే రెగ్యులర్ ఉద్యోగికి పాఠశాల ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు.

అందుబాటులో యూరియా



అనంతపురం సెంట్రల్: జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 16,025 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేటు డీలర్ల వద్ద 822 మెట్రిక్ టన్నులు, సొసైటీల వద్ద 77 మెట్రిక్ టన్నులు, 326 రైతు సేవా కేంద్రాల వద్ద 109 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్, హోల్‌సేలర్ల వద్ద 1,027 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రవాణా (ట్రాన్సిట్) 649 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. ఆగస్టు 30న జిల్లాకు ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన 388 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఈ వారంలో స్పిక్ కంపెనీకి చెందిన 904 మెట్రిక్ టన్నులు, ఐపీఎస్ కంపెనీకి చెందిన 800 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు తెలిపారు.

నిను మరువం రాజన్నా

అన్ని వర్గాలకూ సంక్షేమం పంచిన వైఎస్సార్

- జలయజ్ఞంతో కరువు సీమలో జలసిరులు
- దేశమే మెచ్చేలా పథకాల అమలు
- ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్న జిల్లావాసులు
- నేడు వైఎస్సార్ వర్ధంతి

ఆయన్ను కొలవని పల్లె లేదు
ఆయన్ను తలవని తల్లి లేదు
అపన్నులకు ఆత్మబంధువు
అభాగ్యుల పాలిట కల్పతరువు

కుయ్‌కుయ్ మనే 108 సైరన్‌లో..
పేదవాడి గుండె చప్పుడులో..
కూలి కష్టంలో...రైతు స్వేదంలో..
నిరుపేద ఇంట వెలిగిన అక్షర కాంతిలో..
కూలీలు కలిపే అన్నం ముద్దలో..
అమ్మలక్కల అభివృద్ధి పథంలో..
పారే నీరులో...పచ్చని పొలంలో
కనిపిస్తూనే ఉంటారు..

భౌతికంగా దూరమైనా..
నమస్తే అక్కయ్య... నమస్తే అన్నయ్యా..
నమస్తే తమ్ముడూ.. నమస్తే చెల్లెమ్మ..
అంటూ ఆప్యాయతతో కూడిన
ఆ పిలుపు వినిపిస్తూనే ఉంటుంది.

అనంతపురం సెంట్రల్: కరువు సీమలో కృష్ణా జలాలు పారుతున్నాయంటే అది దివంగత నేత వైఎస్సార్ చలువేనని జిల్లా ప్రజానీకం కొనియాడుతోంది. జిల్లాలో కరువు నిర్మూలనలో భాగంగా సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తాగు నీటి పథకంగా ఉన్న హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టును సాగునీటి ప్రాజెక్టుగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఫేజ్-1 పనులకు రూ.1,305 కోట్లు, ఫేజ్-2కు రూ. 1,880 కోట్లు విడుదల చేసి, తన హయాంలోనే ఫేజ్-1 పనులు పూర్తి చేశారు. ఫేజ్-2 పనులు కూడా 60 శాతం మేర పూర్తయ్యాయి. 2008 నుంచి ఏటా హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయి. తుంగభద్ర ఎగువ కాలువ ప్రాజెక్టు ఆధునికీకరణకు కూడా వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. పీఏబీఆర్ నుంచి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా ఉరవకొండ నియోజకవర్గం నుంచి హిందూపురం వరకూ తాగునీటిని అందించారు. అనంతపురం నగరానికి తాగునీటి పథకాన్ని తీసుకొచ్చారు. పీఏబీఆర్‌కు తుంగభద్ర జలాశయం నుంచి 10 టీఎంసీలు ప్రత్యేకంగా నీటి కేటాయింపులు చేశారు. తుంగభద్ర నుంచి కేసీ కెనాల్ వాటా నీటిని పోతిరెడ్డి పాడు నుంచి తీసుకుంటూ కేసీ కెనాల్ వాటా పీఏబీఆర్‌కు మళ్లించారు. దామాషా ప్రకారం ఏటా 4 టీఎంసీలకు పైగా అదనపు జలాలు వస్తున్నాయి. గండికోట రిజర్వాయర్ నుంచి తాడిపత్రి, శింగనమల, అనంతపురం రూరల్, గుత్తి, గుంతకల్లు నియోజకవర్గాలకు తాగునీటిని అందించేందుకు జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకాన్ని తీసుకొచ్చారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి తాగునీటి పథకాన్ని చేపట్టారు. కదిరి, ధర్మవరం, పుట్టపర్తి మున్సిపాలిటీలకూ తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.



బాలికను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్సార్ (ఫైల్)



ఆరోగ్యశ్రీ ప్రదాత

ఆరోగ్యశ్రీ పథకం పేరు వినగానే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారు. మొదటి దశలో అనంతపురం జిల్లాలోనే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. మొదట్లో 168 వ్యాధులతో ప్రారంభమైన ఈ పథకం తర్వాత 958 చికిత్సలకు చేరింది. ఈ పథకం ద్వారా పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం పొందారు. పుట్టుకతోనే చెవిటి మూగ ఉన్న పిల్లలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు వెచ్చించి కాంక్లియర్ ఇంప్లాంట్స్ వేయించిన ఘనత డాక్టర్ వైఎస్సార్‌దేనని అందరికీ తెలిసిందే. దీంతో పాటు ఆపదలో నేనున్నానంటూ దూసుకొచ్చే 108 వాహనాల రూపకర్త వైఎస్సారే కావడం గమనార్హం.



వజ్రకరూరు మండలం రాగులపాడు వద్దనున్న హంద్రీ-నీవా పంపులు

రైతు నేస్తం..

2004లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపైనే ఉచిత కరెంటు, విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తూ తొలి సంతకంతోనే వైఎస్సార్ వ్యవసాయానికి ఊపిరిపోశారు. ఉమ్మడి జిల్లా రైతులకు చెందిన రూ.70.65 కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ చేశారు. ఐదేళ్లు 1.75 లక్షల వ్యవసాయ మోటార్లకు రూ.వందల కోట్లు విలువ చేసే కరెంటు ఉచితంగా సరఫరా చేశారు. 2004కు ముందు రూ.1,000 కోట్లలోపున్న పంట రుణాలను రూ.6,594 కోట్లకు చేర్చారు. పావలా వడ్డీ కింద రూ.44 కోట్లు ఇచ్చారు. పంటల బీమా పథకాన్ని రైతులకు మేలు జరిగేలా మార్పు చేసి అంతులేని ధీమా కల్పించారు. 2004-2009 మధ్య వేరుశనగ రైతులకు పంట కోత ఫలితాల ఆధారంగా బీమా కింద కింద ఏకంగా రూ.1,138 కోట్ల పరిహారం ఇచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.100 కోట్లు అందించారు. 2008లో 3,03,937 మంది రైతులకు చెందిన రూ.554.92 కోట్ల రుణాలు ఒకేవిడతలో మాఫీ చేశారు. అప్పటికే బ్యాంకులకు రుణాలు చెల్లించిన రైతులకు ప్రోత్సాహకాల కింద 3,61,269 మందికి రూ.5 వేల చొప్పున రూ.174.04 కోట్లు అందించారు. 2004- 2009 వరకు ఆరేళ్ల కాలంలో 28,05,901 మంది రైతులకు రూ.280.88 కోట్ల రాయితీతో 26,02,717 క్వింటాళ్ల వేరుశనగ, అలాగే, కంది, ఆముదం లాంటి ఇతర విత్తనాల కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, పశుపోషణ, పట్టు, పండ్లతోటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల రైతులకు కూడా చేయూత అందించారు. రూ.25 కోట్ల రాయితీ ఇచ్చి పశుక్రాంతి, జీవక్రాంతి కింద 50 శాతం రాయితీతో మేలుజాతి పశువులు, గేదెలు అందజేసి క్షీరవిప్లవానికి శ్రీకారం చుట్టారు. 40 వేల హెక్టార్లలో పండ్ల తోటల విస్తరణకు రూ.80 కోట్ల సబ్సిడీ ఇచ్చారు. దీంతో అప్పట్లోనే 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ'గా పేరొచ్చింది. రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలను ఎస్సీ ఎస్టీలకు వంద శాతం, ఇతరులకు 90 శాతం రాయితీతో ఇవ్వడంతో 1.13 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఇవే కాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలు ఇప్పటికీ రాజన్నను గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

టీడీపీ వర్గీయుల దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ప్రహరీ ధ్వంసం
- అడ్డొచ్చిన వారిపై దాడి







ఇంటి గోడ కూల్చివేసిన దృశ్యం, అవిలిగొండ శోభా చేయి విరిగిన దృశ్యం, తీవ్రంగా గాయపడిన ఆదెప్ప

రాప్తాడు: కూటమి ప్రభుత్వం వచ్చాక రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. సోమవారం రాప్తాడు మండలం భోగినేపల్లిలో ఓ మహిళ, మరో వ్యక్తిపై టీడీపీ శ్రేణులు కిరాతకంగా దాడికి పాల్పడ్డాయి. వివరాలు.. భోగినేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అవిలిగొండ శివయ్య తన ఇంటి కుడి పైపు మూడు అడుగుల స్థలం వదిలి నూతన ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. పక్కనే టీడీపీ కార్యకర్త వలగోండ కదిరప్పకు చెందిన పాడుబడిన ఇంటితో పాటు మరొక ఇల్లు ఉంది. శివయ్య ఇంటిపక్కనే ఉన్న మూడు అడుగుల స్థలం కూడా తనదేనంటూ కదిరప్ప కబ్జా చేసేందుకు పూనుకున్నాడు. సోమవారం ఉదయం శివయ్య స్థలానికి సంబంధించిన పాత గోడను కూల్చివేసేందుకు సిద్ధపడ్డాడు. శివయ్య, ఆయన భార్య జానకమ్మ అడ్డు చెప్పగా.. 'ఈ స్థలం నాది. ఇప్పుడున్నది మా ప్రభుత్వం. అడ్డొస్తే ఇక్కడే పాతి పెడతా' అంటూ దాడికి దిగాడు. దీనిపై శివయ్య కుమార్తె శోభా, అన్న అవిలిగొండ ఆదెప్ప నిలదీయగా.. వారిపైనా దాడి చేశాడు. కదిరప్పతో పాటు భార్య శివమ్మ, కుమారుడు సాయికుమార్, టీడీపీ నాయకులు ధనారెడ్డి, గోపాలప్ప ఇనుప రాడ్లు, గడ్డర్లు తీసుకుని వచ్చి దాడి చేశారు. దాడిలో అవిలిగొండ శోభా చేయి విరిగింది. ఆదెప్ప తల పగిలింది. శివయ్య, జానకమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. గ్రామస్తులు అడ్డుకోకుంటే టీడీపీ నాయకులు చంపేసేవారని స్థానికులు చెప్పారు.

కనికరించండి సారూ



దివ్యాంగ బాలుని తల్లిదండ్రుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: కనికరించి.. కరుణ చూపండి అంటూ అధికారులను ప్రజలు వేడుకున్నారు. పదేళ్ల తమ కుమారుడు సోమశేఖర్ బుద్ధిమాంద్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడని, పింఛను రూ.15 వేలు వచ్చేలా చూడాలని కలెక్టర్ వినోద్ కుమార్‌కు అనంతపురం నాల్గో రోడ్డులో నివాసముంటున్న లావణ్య, శ్రీనివాసులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల తదితరులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 380 వినతులు అందాయి.

- తమ భూమి తమకు ఇప్పించాలని అనంతపురం రూరల్ మండలం ఆలమూరుకు చెందిన కుళ్లాయి స్వామి కోరాడు. తన తండ్రి హరిజన నారాయణకు సర్వే నంబరు 334-17లో ఎకరా భూమికి 1976లో ప్రభుత్వం డి.పట్టా మంజూరు చేసిందన్నాడు. 2018లో తండ్రి చనిపోగా.. భూమిని వేరే వాళ్లు ఆక్రమించారన్నాడు. అధికారులు ఆక్రమణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, సమస్య పరిష్కరించకుంటే తమకు చావే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

సర్వ'జన' కష్టాలు



ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఓంకారమ్మ. కుందుర్పి గ్రామానికి చెందిన ఈమెకు ఇటీవల జ్వరం వచ్చింది. ఓంకారమ్మ 11 నెలల కుమారుడు అభినయ్ కూడా జ్వరం బారిన పడ్డాడు. వారం రోజుల క్రితం ఇద్దరూ కర్ణాటకలోని ఓ ఆస్పత్రిలో చూపించుకున్నా జ్వరం తగ్గలేదు. దీంతో సోమవారం మెరుగైన వైద్యం కోసం ఇద్దరూ అనంతపురం సర్వజనాస్పత్రికి వచ్చారు.ఇక్కడ చూస్తే ఓపీ చీటీ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో క్యూలో నిల్చునే ఓపిక లేక ఇలా తల్లీ కుమారుడు కూర్చుండిపోయారు. ఓంకారమ్మ మాత్రమే కాదు.. నిత్యం సర్వజనాస్పత్రిలో ఎంతో మంది ఇలాగే ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

- జీజీహెచ్‌లో దయనీయ పరిస్థితులు
- ఓపీ కోసం గంటల తరబడి నిరీక్షణ
- చిన్నపిల్లల వార్డులో అవస్థలు
- రోగులకు తప్పని ఇబ్బందులు



చిన్న పిల్లల వార్డులో తమ పిల్లలకు తల్లులే నెబ్యులైజర్ పెట్టుకున్న దృశ్యం



సర్వజనాస్పత్రిలో కిటకిటలాడుతున్న మహిళల ఓపీ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వసతులు రోజురోజుకూ దారుణంగా పడిపోతున్నాయి. పేద రోగులకు చుక్కలు కనపడుతున్నాయి. ఇటీవల జిల్లాపై విష జ్వరాలు పంజా విసిరాయి. దీంతో సర్వజనాస్పత్రికి జ్వర పీడితుల సంఖ్య పెరిగింది. ఇక్కడేమో ఓపీ చీటీ తీసుకునేందుకే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. 'అభా' రిజిస్ట్రేషన్ పేరుతో వైద్య సిబ్బంది చుక్కలు చూపుతున్నారు. ఈ క్రమంలో మహిళలు చంటిబిడ్డలను ఎత్తుకుని క్యూలో నిల్చోలేక నరకం అనుభవిస్తున్నారు.

నిద్రమత్తులో పర్యవేక్షణాధికారి..

వాస్తవంగా 'అభా' రిజిస్ట్రేషన్ ఒకసారి చేయిస్తే చాలు. ఇందుకోసం వార్డుల వారీగా ప్రత్యేకంగా ఓపీలు ఏర్పాటు చేసి కంప్యూటర్లు సమకూర్చాల్సి ఉంది. ఈ క్రమంలో అదే సమస్యపై మళ్లీ రోగి వచ్చినప్పుడు నేరుగా ప్రత్యేక ఓపీకి వెళ్తే సరిపోతుంది. కానీ, ఉమ్మడి జిల్లాకే పెద్ద దిక్కైన సర్వజనాస్పత్రిలో ఆ సౌకర్యం లేకుండా పోయింది. 'అభా' కింద ప్రత్యేకంగా కంప్యూటర్లు, ఇతర సామగ్రి మంజూరయ్యాయని చెబుతున్నా.. అవి ఎక్కడున్నాయో తెలియని దుస్థితి నెలకొంది. 'అభా' రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన డాక్టర్ సౌజన్య కుమార్ నిద్రమత్తులో ఉన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రి ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో పేద రోగులకు అవస్థలు తప్పడం లేదు.

చిన్నారులతో చెలగాటం

సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిన్నారుల పట్ల వైద్యులు, కొందరు స్టాఫ్ నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వార్డులో ఆయాసం ఉన్న పిల్లలకు సిబ్బంది పర్యవేక్షణలో నెబులైజేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తల్లులే నెబ్యులైజర్ ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి పట్టడం గమనార్హం.

ఎంఎన్‌ఓల నిర్లక్ష్యం

సర్వజనాస్పత్రిలో రోగులకందే సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆస్పత్రిలోని వివిధ వార్డుల్లో ఎంఎన్‌ఓ (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ)లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యులు, ఇతర సిబ్బందితోనూ ఒక్కోసారి దురుసుగా ప్రవర్తిస్తున్నారు. సోమవారం సర్జికల్ వార్డులో అడ్మిషన్‌లో ఉన్న రామగిరి మండలం పోలేపల్లికి చెందిన కిష్టప్పకు వైద్యులు సిటీ స్కాన్‌కు రెఫర్ చేయగా... ఎంఎన్‌ఓ పత్తా లేకపోవడంతో రోగి కుటుంబీకులే అతికష్టం మీద మొదటి ఫ్లోర్‌లో ఉన్న సర్జరీ విభాగం నుంచి సిటీ స్కాన్ గదికి వీల్‌చైర్‌పై తీసుకెళ్లారు.

హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయండి



ప్రజలకు కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డి, సమన్వయకర్తలు శైలజానాథ్, పెద్దారెడ్డి, పార్టీ నేతలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు
- ప్రతి కుటుంబానికీ ఈ ప్రభుత్వం రూ. 2 లక్షల వరకూ బాకీ: సమన్వయకర్తలు శైలజానాథ్, పెద్దారెడ్డి

పుట్లూరు: హామీలు అమలు చేయకపోవడంపై కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే నిలదీయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల సమన్వయకర్తలు డాక్టర్ శైలజా నాథ్, కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పుట్లూరు మండల కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు అండ్ కో ఇష్టారాజ్యంగా హామీలను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక నేడు అన్ని వర్గాలనూ దారుణంగా మోసగిస్తోందన్నారు. 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ' పథకాలు అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకోవడం సీఎం చంద్రబాబు కపటత్వానికి నిదర్శనమన్నారు. 'ఆడబిడ్డ నిధి' ద్వారా ప్రతి నెలా రూ.1,500 అందిస్తామని నేడు మరిచిపోయారన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో పరిశీలిస్తే చాలా పథకాలు ప్రజలకు అందలేదన్నారు. టీడీపీ నాయకులు ఇళ్ల దగ్గరకు వస్తే ప్రభుత్వం బాకీ పడ్డ మొత్తాన్ని ఇవ్వాలని నిలదీయాలన్నారు. ప్రతి ఇంటికీ కనీసం రూ.లక్ష నుంచి రూ. 2 లక్షలు బకాయి ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి, బీసీ నారాయణరెడ్డి, వంశీ గోకుల్‌రెడ్డి, జెడ్పీటీసీ నీలం భాస్కర్, జిల్లా కార్యదర్శి విష్ణునారాయణ, శింగనమల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఫణీంద్ర, మండల కన్వీనర్లు యల్లారెడ్డి, పూల ప్రసాద్, నార్పల ఖాదర్‌వలీఖాన్, నాయకులు సర్పంచ్ రామక్రిష్ణారెడ్డి, లాయర్ భాస్కర్‌రెడ్డి, మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, కంచెం శ్రీనివాసులరెడ్డి, శివారెడ్డి, నారాయణస్వామి, మాజీ సర్పంచ్ రామాంజులరెడ్డి, రామమోహన్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, కేతిరెడ్డి సురేష్‌రెడ్డి, దోశలేడు నరసింహారెడ్డి, రమణారెడ్డి, మద్దిలేటి, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, సూరి, రామమోహన్, రసూల్ పాల్గొన్నారు.

పంటల బీమాకు చంద్రగ్రహణం





కూడేరు మండలం పి.నారాయణపురంలో పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- కూటమి సర్కారుపై రైతుల్లో అవనమ్మకం
- ప్రీమియం కట్టకుండా బీమాకు దూరంగా లక్ష మందికి పైగా రైతులు
- ముగిసిన బీమా ప్రీమియం చెల్లింపు గడువు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి పంటల బీమాకు ప్రీమియం చెల్లించే గడువు ఆగస్టు నెలాఖరుతో ముగిసింది. అయితే చంద్రబాబు సర్కార్‌పై అపనమ్మకంతో పంటల బీమా పథకంపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లింది. దీనికి తోడు ప్రీమియం చెల్లించలేక లక్ష మందికి పైగా రైతులు పంటల బీమా పథకానికి దూరంగా ఉన్నారు. మొత్తమ్మీద 1.44 లక్షల మంది రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించి 2.30 లక్షల హెక్టార్ల పంటలకు బీమా చేయించుకున్నారు.

గడువు మీద గడువు పొడిగించినా..

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకాలపై రైతుల్లో ఆశలు సన్నగిల్లినట్లు స్పష్టమవుతోంది. గతంలో బీమా పథకాల కోసం ఎగబడిన రైతులు ప్రస్తుతం దీనిపై అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడాది జూలై 15 లోపు తమ వాటా కింద పంటల వారీగా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం గడువు విధించింది. అయితే రైతులు బీమా పథకంపై ఆసక్తి చూపకపోవడంతో తొలుత జూలై ఆఖరు వరకు, ఆ తర్వాత ఆగస్టు 15 వరకు గడువు పెంచారు. మరోసారి ఆగస్టు నెలాఖరు వరకు సమయం ఇచ్చారు. ఇలా గడువు మీద గడువు పొడిగించి అధికారులు వెంట పడడంతో అతికష్టమ్మీద రైతులు బీమా చేయించారు. పంట నష్టపోయినా చంద్రబాబు ప్రభుత్వం పరిహారం ఇచ్చేది లేదనే అనుమానంతో ఇంకా లక్ష మందికి పైగా రైతులు పంటల బీమాకు దూరంగా ఉన్నారు. వీరిలో కొందరు బీమా ప్రీమియం చెల్లించలేని స్థితిలో ఉండడం గమనార్హం.

సాంకేతిక సమస్యలు తప్పవా?

ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకాలు చేయించుకున్న రైతులకు మున్ముందు సాంకేతిక సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉన్నట్లు సమాచారం. ఖరీఫ్ మొదలు కాకముందే పంట రుణాల రెన్యువళ్లు మొదలు కావడంతో చాలా మంది ఎకరాకు రూ.640 ప్రకారం చెల్లించి వాతావరణ బీమా చేయించుకున్నారు. మరికొందరు కంది, పత్తి, ఆముదం పంటలకు చేయించారు. ఇంకొందరు ఉద్యాన పంటలకు ప్రీమియం చెల్లించారు. అయితే ప్రీమియం కట్టినా పంట సాగు చేయకుండా కొందరు రైతులు ఇతర పంటలు సాగు చేసినట్లు తెలుస్తోంది. వేరుశనగకు ప్రీమియం కట్టిన రైతులు వాతావరణ పరిస్థితులు అనుకూలించక చివరకు కంది, ఆముదం, పత్తి లాంటి పంటలు వేశారు. కందికి ప్రీమియం కట్టిన రైతులు వేరుశనగ లేదా ఇతర పంటలు వేశారు. ప్రీమియం చెల్లించిన పంటనే ఈ–క్రాప్‌లో నమోదు చేసే పరిస్థితి ఉంది. ఈ–క్రాప్‌లో ఒక పంట, ప్రీమియం మరో పంటకు చెల్లించడంతో బీమా పరిహారం దక్కడం కష్టమని తెలుస్తోంది. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారిస్తే కానీ మున్ముందు రైతులకు న్యాయం జరిగే పరిస్థితి లేదంటున్నారు.

1.44 లక్షల మంది బీమా పరిధిలోకి

ప్రీమియం చెల్లింపు గడువు ముగిసేనాటికి 1.44 లక్షల మంది ఫసల్‌బీమా, వాతావరణ బీమా పరిధిలోకి వచ్చారు. 2.30 లక్షల హెక్టార్ల పంటలకు ప్రీమియం కట్టారు. ఈ ఖరీఫ్‌లో 12 రకాల పంటలకు బీమా పథకం అమలు చేస్తున్నారు. అందులో ప్రధానమంత్రి ఫసల్‌బీమా కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరపకు దిగుబడుల ఆధారంగా బీమా పథకం వర్తింపజేశారు. ఈ నేపథ్యంలో కంది రైతులు ఎకరాకు రూ.80 ప్రకారం ప్రీమియం చెల్లించారు. వరి రైతులు రూ.164, జొన్నకు రూ.84, మొక్కజొన్నకు రూ.132, ఆముదానికి రూ.80, ఎండు మిరపకు రూ.576 ప్రకారం ప్రీమియం కట్టారు. ఇక వాతావరణ బీమా పథకాన్ని వేరుశనగ, పత్తి, దానిమ్మ, బత్తాయి, టమాట, అరటికి వర్తింపజేశారు. ఇందులో వేరుశనగ ఎకరాకు రూ.640 ప్రకారం ప్రీమియం కట్టారు. పత్తికి రూ.1,140, దానిమ్మకు రూ.3,750, చీనీ, బత్తాయికి రూ.2,750, టమాటాకు రూ.1,600, అరటికి రూ.3 వేల ప్రకారం ప్రీమియం చెల్లించారు.

క్లుప్తంగా

తల్ సైనిక్ క్యాంప్‌నకు ఎంపిక



క్యాంప్‌లో పాల్గొనేందుకు ఢిల్లీకి చేరుకున్న మల్లికార్జున

గుంతకల్లు టౌన్: ఢిల్లీ వేదికగా జాతీయ స్థాయిలో జరిగే తల్ సైనిక్ క్యాంప్‌నకు గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ హెచ్.మల్లికార్జున ఎంపికయ్యాడు. ఏపీ, తెలంగాణ నుంచి 8 మంది ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేయగా ఇందులో ఎస్‌కేపీ కళాశాల బీఏ (సెకండియర్) విద్యార్థి మల్లికార్జున అర్హత సాధించడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ బాలకృష్ణ అభినందించారు.

రోగులకు 'కరెంట్' కష్టాలు



ఎక్స్‌రే విభాగం వద్ద వేచి ఉన్న రోగులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కరెంట్ కష్టాలు వెన్నాడుతున్నాయి. జనరేటర్, ఇన్వర్టర్ ఉన్నా ఫలితం లేకుండా పోయింది. ఫలితంగా రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకే ఎక్స్‌రే తీయించుకునేందుకు 60 మంది రోగులు సంబంధిత విభాగం వద్దకు చేరుకున్నారు. అయితే తెల్లవారుజాము నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎక్స్‌రే విభాగం వద్ద రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అయినా జనరేటర్ జోలికి ఎవరూ వెళ్లలేదు. చివరకు రోగుల్లో అసహనం వ్యక్తమవడంతో ఐదు గంటల తర్వాత జనరేటర్ ఆన్ చేశారు.

40.3 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తిలో ఉన్న లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్స్ దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌కు డీబీటీకు మధ్య వ్యత్యాసం ఉన్న, అనుమతి పత్రాలు లేని పలు రకాల కంపెనీలకు చెందిన 40.3 మెట్రిక్ టన్నుల ఎరువులకు స్టాఫ్ సేల్స్ నోటీసులు జారీ చేసినట్లు మండల వ్యవసాయ క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రావణ్‌కుమార్, విస్తరణాధికారి నందకిరణ్ తెలిపారు. సోమవారం ఎరువుల దుకాణంలో వారు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రూ.11.48 లక్షల విలువ చేసే ఎరువులకు సంబంధించి రికార్డుల్లో వ్యత్యాసాలు గుర్తించి విక్రయాలు నిలుపుదల చేశారు.

డీజే సౌండ్.. గుండెపోటుతో కార్మికుడి మృతి



శ్రీనివాసులు

రాయదుర్గం టౌన్: వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే సౌండ్ కారణంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడు పూలకుంట శ్రీనివాసులు (36) గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. రాయదుర్గంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు కాలనీలో కొలువుదీర్చిన గణేష్ నిమజ్జనంలో ఆదివారం రాత్రి పాల్గొన్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల ప్రాంతంలో డీజే శబ్దాలకు తీవ్ర అస్వస్థతకు లోనై ఇంటికి చేరుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కాగా, రెండు నెలల క్రితమే ఆయన గుండె సంబంధిత చికిత్స పొందినట్లు బంధువులు, తోటి కార్మికులు తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, పారిశుధ్య మేస్త్రీలు అంబేడ్కర్ కాలనీకి చేరుకుని మృతుడికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నివాళులర్పించిన వారిలో వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలీబాషా, కౌన్సిలర్లు ఉన్నారు.

జెడ్పీలో అతిథి గృహాల ప్రారంభం



అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని అతిథి గృహాలను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సోమవారం సాయంత్రం పునఃప్రారంభించారు. రూ.30 లక్షలతో ఇటీవల అతిథి గృహాలను ఆధునికీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శివశంకర్, పంచాయతీరాజ్ సబ్ డివిజన్–1 డీఈఈ కె.లక్ష్మీనారాయణ, ఏఈఈ శేషయ్య, జెడ్పీ ఏఓలు షబ్బీర్ నియాజ్, భాస్కర్‌రెడ్డి, రత్నాబాయి, శ్రీవాణి, మహబూబ్ వలి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రైతు ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో పడి ఉన్న సావిత్రమ్మ

పుట్లూరు: భూ వివాదం నేపథ్యంలో పుట్లూరు మండలం చిన్నమల్లేపల్లికి చెందిన మహిళా రైతు సావిత్రమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... చింతలపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 72లో 5 ఎకరాల భూమి తన పేరుపై ఉన్నట్లుగా సావిత్రమ్మ చెబుతోంది. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కులంధర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి ఆ భూమిని తాము కొనుగోలు చేశామంటూ సోమవారం ట్రాక్టర్‌తో సేద్యం పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న సావిత్రమ్మ అక్కడకు చేరుకుని సేద్యం పనులు అడ్డుకుంది. అయినా వారు పనులు కొనసాగించడంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటికి చేరుకుని పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో ఇంటి బయట అరుగుపై పడి ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, ఈ భూ వివాదంపై గతంలో పలుమార్లు ఇరువర్గాల వారు అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలుస్తోంది.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

అనంతపురం: ప్రేమించి.. మతాంతర వివాహం చేసుకున్న యువతి.. భర్త వేధింపులు తాళలేక అర్ధంతరంగా తనువు చాలించింది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని చాకలి వీధిలో నివాసముంటున్న చాకలి అయ్యప్పకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె సవిత (24)కు ఐదేళ్ల క్రితం అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి ఫోన్‌లో పరిచయమయ్యాడు. డ్రైవింగ్‌తో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వచ్చేసిన సవిత దస్తగిరిని పెళ్లి చేసుకుంది. అనంతరం తన పేరును దూదేకుల రేష్మాగా మార్చుకుంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఏడాదిగా అనంతపురం నగరంలో కాపురం ఉంటున్నారు. అయితే సవితతో పెళ్లి ఇష్టం లేని దస్తగిరితో పాటు అతని తల్లి ఇమామ్‌బీ, అక్క నూర్జహాన్ తరచూ వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. 'నువ్వు చచ్చిపోతే.. మా కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాం' అంటూ శారీరకంగా, మానసికంగా వేధించేవారు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో దస్తగిరి తరచూ సవితపై భౌతిక దాడులకు పాల్పడేవాడు. వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో గత నెల 31న రాత్రి 9 గంటల సమయంలో సవిత విషపూరిత ద్రావకం తాగింది. విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు దస్తగిరి ఫోన్ చేసి తెలిపి, అనంతపురంలోని జీజీహెచ్‌లో చేర్పించినట్లు వివరించాడు. దీంతో సవిత కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. చికిత్సకు స్పందించక సోమవారం అర్ధరాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు.

సరోగసి సెంటర్లు నిబంధనలు పాటించాలి : డీఎంహెచ్‌ఓ

అనంతపురం మెడికల్: జిల్లాలోని ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు... రెగ్యులేషన్ యాక్ట్‌లను తప్పక అనుసరించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐవీఎఫ్, ఐసీఐయస్ వంటి చికిత్సలు కేవలం అర్హులైన నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే జరగాలన్నారు. ఎగ్స్/వీర్యం/భ్రూణాల విక్రయం పూర్తిగా నిషేధమన్నారు. కేవలం సరోగసికి మాత్రమే అనుమతి ఉంటుందని, వాణిజ్య సరోగసికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే టీచర్ ఉద్యోగం కోల్పోయా

- 14వ ర్యాంకర్ ఆవేదన



దాసరి మహేష్ కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వం, శ్రీ కృష్ణదేవ రాయ యూనివర్సిటీ(ఎస్కేయూ) నిర్లక్ష్యం వల్ల తాను టీచర్ పోస్టుకు ఎంపికయ్యే అవకాశాన్ని కోల్పోయానని డీఎస్సీ–25లో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో జిల్లాలో 14వ ర్యాంకు సాధించిన దాసరి మహేష్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విద్యాశాఖ అధికారులను కలిసి తన సమస్యను వివరించారు. 'ఇటీవల ప్రకటించిన డీఎస్సీ–25 ఫలితాల్లో ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలో నేను 84 మార్కులతో 14వ ర్యాంకు సాధించాను. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాగా, బీపీఈడీ ఉత్తీర్ణత సర్టిఫికెట్ మే 15వ తేదీలోపు లేనందున టీచర్ పోస్టుకు అనర్హుడిగా ప్రకటించారు. జీఓ–17లో అర్హత అనేది సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో చూపించాలనేది స్పష్టంగా ఉంది. నేను కూడా పరిశీలన సమయానికి సర్టిఫికెట్లను చూపించినా అధికారులు ఒప్పుకోలేదు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం మార్చి, ఏప్రిల్ మొదటి వారంలోనే ఫైనల్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాయి. కానీ ఎస్కేయూ మాత్రం నిర్వహించలేదు. చివరి సెమిస్టర్ పరీక్షలను దాదాపు ఐదు నెలలు ఆలస్యంగా నిర్వహించింది. డీఎస్సీ–25కి అన్ని యూనివర్సిటీల విద్యార్థులు అర్హత సాధించినా, ఎస్కేయూలో చదివి మంచి మార్కులు సాధించిన నాకు మాత్రం అన్యాయం జరిగింది. ప్రభుత్వం, విద్యాశాఖ, ఎస్కేయూ నిర్లక్ష్యం వల్ల నేను ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చింది. సకాలంలో పరీక్షలు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్‌పై ఉంది. విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వం బాధ్యత వహించి నాకు న్యాయం చేయాలి' అని దాసరి మహేష్‌కుమార్ కోరారు.

లక్ష్యాలకు అనుగుణంగా 'ఉపాధి'

- కలెక్టర్ వినోద్ కుమార్



చియ్యేడులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రాప్తాడు రూరల్: లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి పనులు చేపడుతూ సమగ్ర గ్రామీణాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలో ఆయన పర్యటించారు. ఉపాధి హామీ పథకం కింద రూ. 2.30 లక్షల నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. అనంతరం అక్కడే కంపోస్ట్ పిట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద కలెక్టర్ మొక్కలు నాటారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, నీటి సౌకర్యం కల్పించాలని, వర్మీ కంపోస్ట్ అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు. అక్కడే నాడప్ ఫిట్స్‌ను ప్రారంభించిన అనంతరం ఎండోమెంట్ భూమిని పరిశీలించారు. రూ. 35 వేలతో నిర్మించిన పశువుల నీటి తొట్టెను ప్రారంభించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ టి.గంగాధర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ శివశంకర్, డ్వామా పీడీ సలీం బాషా, తహసీల్దార్ మోహన్ కుమార్, ఎంపీడీఓ దివాకర్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎంపిక



ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం అనంతపురంలోని షారోన్ ఆరాధన మందిరంలో నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. సొసైటీ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ డాక్టర్ ఎస్.యెషయా, వైస్ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ డా.అనిల్ కుమార్, సెక్రటరీగా రెవరెండ్ ఎం.వరప్రసాద్, జాయింట్ సెక్రటరీగా కురియన్ డానియల్, కోశాధికారిగా అడమ్, ఈసీ సభ్యులుగా డేవిడ్‌రాజ్, రాజశేఖర్, ఎస్.జీవరత్నం, డేనియల్ కొండయ్యను ఎన్నుకున్నారు.

బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పుట్లూరు సోహన

అనంతపురం: బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు జిల్లాకు చెందిన పుట్లూరు సోహన ఎంపికైంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు పంజాబ్‌లోని లూధియానాలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.

నాలుగు కళ్ల సీతాకోక చిలుక ప్రత్యక్షం



రాప్తాడు: మండలంలోని మరూరు గ్రామంలో నాలుగు కళ్ల సీతాకోక చిలుక ప్రత్యక్షమైంది. గ్రామం నుంచి ధర్మవరానికి వెళ్లే మార్గంలో ఉన్న కుళ్లాయప్ప హోటల్ వద్ద కనిపించిన సీతాకోక చిలుక రెక్కలపై నాలుగు కళ్లు ఉండడంతో జనం ఆసక్తిగా గమనించారు. తమ మొబైల్స్‌లో ఫొటోలు తీసేందుకు పోటీ పడ్డారు.

నాలుగు గ్రామాల్లో మ్యాజిక్ డ్రైయిన్లు

అనంతపురం టౌన్: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కూడేరు మండలం ముద్దలాపురం, పామిడి మండలం నీలూరు, గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం, పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు గ్రామాల్లో మ్యాజిక్ డ్రైయిన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీఆర్ శాఖ అధికారుల నుంచి నివేదికలు అందగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఏసీబీ చార్జెస్‌పై ప్రజెంటింగ్ అధికారి నియామకం

అనంతపురం అర్బన్: అవినీతి కేసులో విశ్రాంత తహసీల్దారు, మరికొందరు రెవెన్యూ అధికారులపై ఏసీబీ అధికారులు ఫ్రేమ్ చేసిన చార్జెస్‌పై ప్రజెంటింగ్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు సోమవారం జారీ అయ్యాయి. 2020, జనవరి 24న ముదిగుబ్బ తహసీల్దారు కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు, ఆన్‌లైన్‌లో నమోదు, మ్యుటేషన్ తదితర వ్యవహారాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అప్పటి తహసీల్దారు అన్వర్ హుస్సేన్ (ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేశారు), డిప్యూటీ తహసీల్దారు రామకృష్ణ, మండల సర్వేయర్ రత్నాకర్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్–1 సందీప్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఏఎస్‌ఓ చంద్రశేఖర్, మరికొందరిపై ఏసీబీ చార్జెస్ ఫైల్ చేసింది. ఈ వ్యవహారంలో ప్రస్తుతం ప్రజెంటింగ్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఏసీబీ చార్జెస్‌పై ప్రజెంటింగ్ అధికారి విచారణ చేపట్టి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

'పచ్చ' నేతలు.. డబ్బుల కట్టలు!

శింగనమల: కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక, మట్టిని 'తమ్ముళ్లు' చెరబట్టారు. పేకాటతో జేబులు నింపుకుంటున్నారు. తాజాగా 'పచ్చ' నేతలు ఓ చోట కూర్చుని నోట్ల కట్టలు లెక్కిస్తున్న వీడియో బయటకు రాగా.. కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వసూళ్లు చేశారని టీడీపీకి చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లోనే తీవ్ర చర్చ సాగడం గమనార్హం. నియోజకవర్గ టీడీపీలో ఇప్పటికే రెండు గ్రూపులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా బయటకి వచ్చిన వీడియోని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గ నాయకులు విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. నియోజకవర్గంలో విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగాలిప్పిస్తామంటూ రూ.లక్షల్లో వసూలు చేశారంటూ పోస్టులు పెడుతున్నారు.

చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- సంపద సృష్టి పేరుతో ప్రజల నెత్తిన రూ.2 లక్షల కోట్ల అప్పుల భారం
- ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలు వివరించాలని పిలుపు
- వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ సదస్సులో రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి



సదస్సులో ప్రసంగిస్తున్న అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి

కర్నూలు(టౌన్): అధికారం కోసం అబద్ధాలు చెప్పిన సీఎం చంద్రబాబును నిలదీద్దామంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పిలుపు నిచ్చారు. సోమవారం కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ సదస్సు పార్టీ జిల్లా అధ్యక్షురాలు శశికళ అధ్యక్షతన జరిగింది. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తొలుత వరుదు కళ్యాణి ప్రసంగించారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఏడాదిన్నర గడిచినా ఒక్కటీ అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పాలనలో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు ఏడాదిన్నర కాలంలోనే ప్రజల నెత్తిన రూ.2 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపారన్నారు. రాష్ట్రంలో 24 శాతం మద్యం అమ్మకాలు పెరగడంతోనే మహిళలపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. జగనన్న వల్లే మహిళా సాధికారత సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. జగనన్న కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తామన్నారు. జగనన్న హయంలో మహిళలు బంగారం కొనుగోలు చేస్తే, ఈ ప్రభుత్వంలో బంగారాన్ని అమ్ముకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. సమావేశంలో సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు సి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రేసింగ్‌కు అనుమతులు ఎవరిచ్చారు?

- మాజీ మంత్రి సాకే శైలజనాథ్ సూటి ప్రశ్న

అనంతపురం కార్పొరేషన్: శింగనమల నియోజకవర్గంలో రేసింగ్‌కు అనుమతులు ఎవరిచ్చారో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ ప్రశ్నించారు. సోమవారం అనంతపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటకాభివృద్ధి పేరిట రేసింగ్‌లను ప్రోత్సహిస్తారా అని విమర్శించారు. ఇటీవల నగరంలో సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తున్నారంటూ రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను తొక్కించిన ఎస్పీ జగదీష్.. రేసింగ్ పేరిట పలువురు ప్రమాదానికి గురైనా పట్టించుకోరా అని ప్రశ్నించారు. సమావేశంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ నీలం భాస్కర్, నాయకులు పూలప్రసాద్, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, రామాంజినేయులు, చికెన్ నారాయణ స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శిథిలావస్థలో బస్ షెల్టర్



పైలబోయలపల్లి వద్ద పిచ్చి మొక్కల వద్ద ఉన్న బస్ షెల్టర్

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పైలబోయలపల్లి బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. చెన్నేకొత్తపల్లి నుంచి ఆమిదాలకుంటకు వెళ్లేదారిలో ఉన్న పైలబోయపల్లి ఉంది. ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి సుమారు కిలోమీటరుకుపైగా దూరం ఉంటుంది. దీంతో గాలి, ఎండ, వాన నుంచి రక్షణ పొందేందుకు బస్ షెల్టర్‌ను నిర్మించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆ షెడ్డు చుట్టూ పిచ్చి మొక్కలతో పాటు ముళ్లపొదలు విపరీతంగా పెరిగాయి. అసలు అందులోకి వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. దీంతో ఆటోలు, బస్సు కోసం వేచి ఉంటే ప్రయాణికులు చెట్ల కింద వేచి ఉండే దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ప్రయాణికులు వేచి ఉండేందుకు అనువుగా బస్సు షెల్టర్‌ను శుభ్రం చేయించడంతో పాటు లోపల మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తక్షణ పరిష్కారం చూపాలి

అనంతపురం: ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని మహిళా డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 81 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా మాట్లాడుతూ చట్టపరంగా పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఫిర్యాదులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని, గడువులోపు పరిష్కారం కావాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.

వివాహిత బలవన్మరణం

అనంతపురం: వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసులకు మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన బెస్త మునిస్వామి కూతురు గౌతమి(36)కి అనంతపురంలోని షిర్డీ నగర్‌లో నివాసం ఉండే బెస్త నారాయణస్వామితో 15 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. గౌతమి మైగ్రేన్ (తలనొప్పి)తో ఇబ్బంది పడుతుండేది. భరించలేని విధంగా నొప్పి వచ్చినపుడు చనిపోతానని చెబుతుండేది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం కుమారుడు హర్షిత్ సాయి స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్‌కు వెళ్లకపోవడంతో కొట్టి మందలించింది. తర్వాత తనకు తలనొప్పి అధికమైందని, మనసు బాగోలేదంటూ తండ్రి మునిస్వామికి ఫోన్ చేసి తెలపగా.. రెండు రోజులు పుట్టింటికి రమ్మన్నాడు. తర్వాత వస్తానని చెప్పి గౌతమి చెప్పింది. అదే రోజు సాయంత్రం 6.30 గంటల నారాయణస్వామి నుంచి మామ మునిస్వామికి ఫోన్ వచ్చింది. 'మీ కూతురు బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది' అని చెప్పాడు. అనంతరం నారాయణస్వామి, కుమారుడు పక్కింటివారి సాయంతో ఆమెను కిందకు దించి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేర్చారు. అయినా పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత గౌతమి మృతి చెందింది. తలనొప్పి భరించలేక తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మునిస్వామి ఫిర్యాదు చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

ఎల్ఐసీ వార్షికోత్సవం

అనంతపురం సెంట్రల్: ఎల్ఐసీ 69వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నగరంలోని బ్రాంచ్-2 కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మేనేజర్ భరత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అసోసియేషన్ నాయకులు ఆదిశేషయ్య, జగదీష్, సిబ్బంది వెంకటేష్, రతన్‌లాల్, సురేష్, హజీ, సూరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: మోడల్ స్కూళ్లలో అసంబద్ధ డిప్యుటేషన్లు రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ మోడల్ సూళ్లల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేనిచోట తాత్కాలిక పని సర్దుబాటు పేరుతో సమీప మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులను వారంలో మూడు రోజుల పాటు వారి సొంత పాఠశాలల్లో, మరో మూడు రోజులు డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పనిచేయాలంటూ ఆదేశాలు జారీ చేశారన్నారు. డీఎస్సీలో పీజీటీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ పోస్టులను నోటిఫై చెయ్యలేదని ఖాళీగా ఉన్న పోస్టుల్లోకి కొత్త టీచర్లు వచ్చే అవకాశం లేదన్నారు. ఈ డిప్యుటేషన్లు తాత్కాలికం కాదని, రానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల దృష్ట్యా ఈ మూడు రోజుల డిప్యుటేషన్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. అటు మూడు రోజులు, ఇటు మూడు రోజులు పాఠశాలలు తిరగడం మూలంగా ఎవ్వరికీ న్యాయం జరిగే పరిస్థితి ఉండదన్నారు. ఖాళీగా ఉన్న ఆయా సబ్జెక్టు పోస్టుల్లో గెస్ట్, ఒప్పంద ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీఎస్ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, రాష్ట్ర కౌన్సిలర్లు యాదవ మూర్తి, బాలి రెడ్డి, మోడల్ స్కూల్ టీచర్లు ఉన్నారు.

నిమజ్జనం చోట.. బతుకు వేట

గణేశ్ నిమజ్జనోత్సవం ముగిసిపోయింది. గణనాథులు గంగమ్మ ఒడికి చేరిపోయారు. నగరం చుట్టుపక్కల ఉన్న కాలువలు, వంకలు, వాగుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇప్పటికే చాలావరకు విగ్రహాలు నీటిలో కరిగిపోయాయి. విగ్రహాలకు వాడిన ఇనుప కడ్డీలు, కట్టెలు, ఇతరత్రా సామగ్రి అలాగే మిగిలిపోయింది. ఈ సామగ్రిని కొందరు పేదలు నీటిలోకి దిగి ప్రమాదకర పరిస్థితుల్లో సేకరించుకుంటున్నారు. అనంతపురం సమీపంలోని కొడిమి వాగులో సామగ్రిని సేకరించుకుంటున్న దృశ్యాలివీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పనికివచ్చే సామగ్రిని నీటిలోంచి సేకరిస్తున్న దృశ్యం



విగ్రహాల నిమజ్జనం అనంతరం వస్తువుల కోసం నీటిలోకి దిగుతుతున్న వ్యక్తి



వస్తువుల సేకరణకు సూచనలిస్తున్న దృశ్యం

నేడు వైఎస్సార్ వర్ధంతి



ఆత్మకూరు: మండల కేంద్రమైన ఆత్మకూరులో మంగళవారం దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాల పోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందని మండలంలోని నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

చెన్నేకొత్తపల్లి: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం చెన్నేకొత్తపల్లిలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల కేంద్రంలోని న్యామద్దెల సర్కిల్ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం వద్దకు మంగళవారం ఉదయం 9 గంటలకు చేరుకోవాలని సూచించారు.

రాప్తాడు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరవుతారన్నారు. మండలా వ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజానాయకుడి అడుగుజాడల్లోనే నా పయనం

- వైఎస్సార్‌ను గుర్తు చేసుకున్న తరిమెల అమరనాథ్‌రెడ్డి



వైఎస్సార్ చేతుల మీదుగా అవార్డునందుకున్న తరిమెల అమరనాథరెడ్డి (ఫైల్)

అనంతపురం కల్చరల్: రక్తదాన ఉద్యమకారునిగా, హాస్యరచయితగా, పాతతరం కమ్యూనిస్టుగా, మానవతామూర్తిగా తరిమెల నాగిరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, ఐదుకల్లు సదాశివన్ వంటి కమ్యూనిస్టుల నిరాడంబరత.. మిత్రుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజాజీవితం తనను ఎంతగానో ప్రభావితం చేశాయని చెబుతుంటారు. వైఎస్సార్‌తో కలిసి చదుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని.. ఆయన అడుగుజాడల్లో నేటికీ నడుస్తున్నానని తెలిపారు. నేడు వైఎస్సార్ వర్ధంతి. ఈ సందర్భంగా వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే... 'విజయవాడలోని లయోల కాలేజీలో 1962లో వైఎస్ రాజశేఖరరెడ్డి పీయూసీ చదువుకునే సమయంలో నేను కూడా అక్కడే చదువుకున్నాను. నాలుగు దశాబ్దాల తర్వాత మేమిద్దరూ మళ్లీ కలుసుకునే అవకాశం వచ్చింది. 2004లో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రంలో విభిన్న రంగాల్లో సేవలందించిన వారికి గుర్తింపుగా 'ప్రతిభా రాజీ' అవార్డులనందించారు. సామాజిక సేవా కార్యకర్తగా, రక్తదాతగా విశేష సేవలందిస్తున్న నాకు 'రాజీవ్ ప్రతిభా అవార్డు'కు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో స్నేహితుడే ముఖ్య అతిథిగా విచ్చేయడంతో నేను బిడియంగా.. వైఎస్సార్ గుర్తు పట్టరేమో అనుకుని కాసింత దూరంగా ఉన్నా. అప్పుడు స్వయంగా వేరే వాళ్ల ద్వారా తన పాత మిత్రుడని తెలుసుకున్న తర్వాత ఆప్యాయంగా సభాముఖంగా ప్రకటించడమే కాకుండా నాకు కూడా మాట్లాడే అవకాశమిచ్చి స్నేహబంధాన్ని చాటుకున్నారు. మళ్లీ నేను ఏనాడూ ఆ స్నేహాన్ని స్వార్థానికి వాడుకునే ప్రయత్నమూ చేయలేదు కాబట్టే అదే మేము ఆఖరుగా కలిసిన సందర్భమైంది. సెప్టెంబరు మాసం వచ్చిందంటే కన్నీళ్లు వచ్చేస్తాయి. ఓ అరుదైన మిత్రున్నే కాదు అపురూపమైన ప్రజానాయకుడిని రాష్ట్రం కోల్పోయిందనేది నా భావన. ఇప్పటికీ ఆయన ఫొటోగ్రాఫే కాదు ఆటోగ్రాఫ్ కూడా అరుదైన జ్ఞాపకంగా దాచుకున్నాను' అని చెప్పే అమరనాథ రెడ్డి దాన్ని అందరికీ చూపించి మురిసిపోతుంటారు.

రేపు అంబికా, కాలవ నివాసాల ముట్టడి

- వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై స్పష్టతకు నాయకుల డిమాండ్

అనంతపురం రూరల్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని మాట తప్పినందున ఈ నెల మూడో తేదీన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నివాసాలను ముట్టడించనున్నట్లు ఏపీ వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య తెలిపారు. వాల్మీకుల జీవితాలతో చెలగాటమాడకుండా ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం రుద్రంపేటలోని వాల్మీకి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాధవయ్య మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎన్నికల సమయంలో కేవలం ఓట్ల కోసం వాడుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా కృషి చేస్తామన్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఎస్టీ జాబితా విషయాన్ని దాటవేయడం మోసపూరితమన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఇతర ప్రజాప్రతినిధులు మౌనం వహిచడం వెనుక ఉన్న అంతర్యమేమని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం న్యాయం చేయని వాల్మీకి నాయకులకు రాజకీయ పదవులు అనుభవించే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రమేష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేష్, నాయకులు భాస్కర్, నాగేంద్ర, పెద్దన్న, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



జిల్లా కోర్టులో విధులు బహిష్కరించిన లాయర్లు

అనంతపురం: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్, న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించిన సీఐ శ్రీకాంత్‌యాదవ్‌పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో సోమవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. రెండు రోజుల పాటు విధులు బహిష్కరించాలని బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పేదలకు ఆర్డీటీ దన్నుగా నిలుస్తోందన్నారు. ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు.

సీఐను సస్పెండ్ చేయాలి..

న్యాయవాది సాయి ప్రసాద్‌పై దురుసుగా ప్రవర్తించి అవమానించిన అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను సస్పెండ్ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ నెల 29న బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో చోటు చేసుకున్న ఘటనలకు సంబంధించి ఎస్పీ క్యాంపు కార్యాలయానికి బాధితులతో పాటు న్యాయవాది సాయి ప్రసాద్ వెళ్లారన్నారు. మహిళలను ఎస్పీ క్యాంపు కార్యాలయంలోకి అనుమతించిన సీఐ.. న్యాయవాది సాయి ప్రసాద్ పట్ల దురుసుగా ప్రవర్తించారన్నారు. నేరస్తుడి తరహాలో ఈడ్చుకెళ్లడం దారుణమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ఉపాధ్యక్షుడు ధర్మసింగ్ నాయక్, గోవిందరాజులు, అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు బడా నారాయణ రెడ్డి, నరసింహులు, సీనియర్ న్యాయవాదులు భీమన్న తదితరులు పాల్గొన్నారు.

'హంద్రీనీవా'లో 250 విగ్రహాల నిమజ్జనం



సోమవారం ఉదయం వినాయకుని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసులు

- సోమవారం ఉదయం వరకూ సాగిన కార్యక్రమం

ఆత్మకూరు: అనంతపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పెద్ద వినాయకుడి విగ్రహాలకు ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఉన్న హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకూ విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. మొత్తం 250 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఉదయం కూడా సీఐ హేమంత్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణరావు, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహా కలసి క్రేన్‌ల సాయంతో నిమజ్జనాన్ని పూర్తి చేయించారు.

ఎస్టీలపై మీ పెత్తనమేంటి?

- జయరాంనాయుడును ప్రశ్నించిన చక్రినాయక్

అనంతపురం కార్పొరేషన్: ఎస్టీలపై మీ పెత్తనం ఏంటని టీడీపీ నేత జయరాం నాయుడును ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి చక్రినాయక్ హెచ్చరించారు. వీరిద్దరి సంభాషణకు సంబంధించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇటీవల నగరంలోని శారదనగర్‌లో చక్రి నాయక్ ఓ నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై టీడీపీ నాయకుడు జయరాం నాయుడు తాను 23వ డివిజన్ కార్పొరేటర్‌ను అంటూ ఫోన్ చేసి చక్రి నాయక్‌తో మాట్లాడారు. 'ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టడం లేదని, మాకు ఫిర్యాదు వచ్చింద'ని జయరాం నాయుడు పేర్కొన్నారు. నిబంధనల మేరకు తాను నిర్మాణం చేపడుతున్నామని, ఎస్టీ అయినందుకు తనపై ఇలా ఆరోపణలు చేయడం, బ్లాక్ మెయిల్ చేయడం సరికాదని చక్రినాయక్ అన్నారు. ఇదే విషయంపై ఎస్టీ కమిషన్‌తో పాటు సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాస్తామని పేర్కొన్నారు. గతంలోనూ డాక్టర్ మూడే సందీప్‌ను ఇదేవిధంగా బెదిరించారని, ఎస్టీలపై మీ పెత్తనమేంటని ప్రశ్నించారు.

స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం



డిక్లరేషన్లతో స్టాండింగ్ కమిటీ సభ్యులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులుగా గూడురు మల్లికార్జున, కె.జయలలిత, బి.లావణ్య, ఎం.దేవి, పి.రామాంజినమ్మ ఎన్నికయ్యారు. స్టాండింగ్ కమిటీలో నలుగురు మహిళలకు అవకాశం ఇవ్వడం గమనార్హం. సోమవారం నగరపాలక సంస్థలో కార్యదర్శి రంగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్లు అందజేశారు. ఈ సందర్భంగా స్టాండింగ్ కమిటీ సభ్యులకు మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ ఐదుసార్లు వరుసగా స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం కావడం చరిత్ర అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని, మాజీ మంత్రి శైలజనాథ్, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతీయ స్థాయిలోనూ రాణించాలి



గౌసియాను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: త్వరలో ముంబయి వేదికగా జరిగే జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లోనూ విజయం సాధించి జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటాలని తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గౌసియాకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర స్థాయిలో గత నెల 26న నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ఆమెను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అభినందించారు. నిర్దేశించిన ప్రణాళిక మేరకు జిల్లా వ్యాప్తంగా 200 గ్రామాల్లో, 400 పాఠశాలల్లో, 86 కళాశాలల్లో 2 నెలల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ఓ మలోల, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఆర్ఐఓ వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మహాత్ముని చిత్రపటం బహూకరణ

జర్మన్ కాన్వాస్‌పై చిత్రించిన మహాత్మా గాంధీ చిత్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు గుత్తికోట సంరక్షణ సమితి సభ్యులు సోమవారం బహూకరించారు. కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో సమితి సభ్యులు కలిసి సన్మానం చేశారు. చీరాలకు చెందిన చిత్రకారుడు రవి గీసిన మహాత్ముని చిత్రపటాన్ని, గుత్తికోటను పాలించిన వంశస్తులపై రచయిత్రి రీటా రామ్మూర్తి గుప్తా రాసిన పుస్తకాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గుత్తి కోట వైభవ పునరుద్ధరణకు సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు చౌదరి విజయభాస్కర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త బేసిక్ ప్లాన్

అనంతపురం సిటీ: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) రూ.400కే కొత్త ట్రిపుల్ ఎఫ్‌టీటీహెచ్ ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఆ సంస్థ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా సోమవారం వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కొందరు కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్ భాగస్వామి(టిప్)గా నమోదై ఎఫ్‌టీటీహెచ్ సేవలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 20 ఎంబీపీఎస్ వేగంతో అపరిమిత ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్, 400+ ఉచిత ఛానెళ్లతో పాటు 44 తెలుగు పే ఛానళ్లను వీక్షించవచ్చని స్పష్టం చేశారు. 9 ఓటీటీఎస్ కూడా ఉంటాయని తెలిపారు. ఇంటర్నెట్, టీవీ ఛానళ్లను పొందేందుకు రూ.140తో ప్రీ పెయిడ్ రీచార్జ్ తప్పనిసరి అని పేర్కొన్నారు. డిజిటల్ అగ్రిమెంట్ కోసం రూ.500 మాత్రమే చెల్లించి బీఎస్ఎన్ఎల్ భాగస్వామిగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓఎల్‌టీ కనెక్టివిటీకి ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.2500+జీఎస్టీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఆసక్తి గల కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్‌గా భాగస్వామి(టిప్)గా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

18,19న ఎస్ఆర్ఐటీలో జాతీయ సదస్సు



కళాశాలలో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ బిలింగుల్ కాన్ఫిరెన్స్ ఆన్ నెక్స్ట్ జెనరేషన్ కన్‌స్ట్రక్షన్ విత్ సస్టైనబుల్ రిలియంట్, అండ్ స్మార్ట్ సివిల్ ఇంజినీరింగ్ (ఎన్‌సీఎస్ఆర్ఎస్‌సీ-2025) సంబంధించి ఈ నెల 18, 19న ఏఐసీటీఈ ఏటీఎల్ఎల్-వాని స్కీం జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ తెలిపారు. సోమవారం ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో పోస్టర్లు విడుదల చేశారు. సదస్సుకు కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి, చైర్‌పర్సన్ జొన్నలగడ్డ పద్మావతి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్ రెడ్డి హాజరవుతారన్నారు. సదస్సులో సబ్జెక్ట్ థీమ్, ద్విభాషా (తెలుగు-ఆంగ్లం) విధానాన్ని అభినందించి పూర్తి స్థాయి సహకారం అందిస్తామన్నారు. సదస్సులో ఆమోదం పొందిన, ప్రదర్శింపబడిన అన్ని పరిశోధనా పత్రాలు రెండు ఐఎస్‌బీఎస్ వాల్యూమ్స్‌లో ఒకటి ఆంగ్లంలో మరొకటి తెలుగులో కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్ రూపంలో ప్రచురిస్తామన్నారు.

నేడు విధుల్లోకి జిల్లా రిజిస్ట్రార్

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) జి.భార్గవ్ నెల రోజుల సెలవు అనంతరం మంగళవారం విధుల్లోకి చేరనున్నారు. ఇక జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న రమణరావు ఈ నెల 5 వరకు సెలవుపై వెళ్లారు. దీంతో రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇస్మాయిల్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

యూరియాపై అపోహలొద్దు

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 1265 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ నిల్వ ఉందని, తగినంత సరఫరా అవుతుందని, ఈ విషయంలో అపోహలు పెట్టుకోవద్దని ప్రాంతీయ నిఘా, అమలు అధికారి వైబీపీటీఏ ప్రసాద్ తెలిపారు.

పింఛన్ల పంపిణీ

అనంతపురం క్రైం: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ సోమవారం చేపట్టారు. మొదటి రోజు 94 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 28,0471 మందికి రూ.123.86 కోట్లు మంజూరైందని తెలిపారు.

సీతాఫలం విక్రయానికి రేపు వేలం

అనంతపురం సెంట్రల్: రాయదుర్గం, కళ్యాణదుర్గం అటవీ రేంజ్ పరిధిలో శీతాఫలం యూనిట్ల అమ్మకానికి బుధవారం వేలం నిర్వహించనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ అప్పావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేల వేలం రద్దు అయితే 4, 6 తేదీల్లో తిరిగి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు 2026 జూన్ వరకూ అటవీ భూముల్లో శీతాఫలాలు తీసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రేపు అనంతపురం శ్రీనగర్‌కాలనీలోని అటవీ శాఖ కార్యాలయంలో జరుగు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

యువతి అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఈ మేరకు యువతి తండ్రి సోమవారం ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం కూలి పని కోసం అంటూ వెళ్లిన యువతి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారిని ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ప్రేమ వ్యవహారం నేపథ్యంలోనే అదృశ్యమై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలోనే కేసు ఛేదిస్తామని ఎసఐ తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

అనంతపురం కార్పొరేషన్: సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ కావాలని విజయవాడలో జరుగుతున్న నిరసనకు మద్దతుగా అనంతపురంలోని వివిధ సచివాలయాల పరిధిలో సోమవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతపట్టుకుని ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నేతలు సుధాకర్, లక్ష్మీనారాయణ, శివశంకర్, వీరనారప్ప, మల్లికార్జున, సిరాల చంద్ర, రామకృష్ణ, మంజునాథ్, జానకి, రమేష్, మారుతీ ప్రసాద్, పర్వతరెడ్డి, తులసీరాం, హారతి, సావిత్రిబాయి, రెహనా, జబీనా, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'సాహితీ సమాలోచన'

అనంతపురం కల్చరల్: ఆంధ్రభారతి– తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం, మధ్యాహ్నం వేర్వేరు సమావేశాల్లో 'డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సాహిత్యంలో వైవిధ్యం' అనే అంశంపై సాహితీ సమాలోచన కార్యక్రమం జరగనుంది. ఆర్ట్స్ కాలేజీ వాణిజ్యశాఖ సమావేశ మందిరం వేదికగా కార్యక్రమాలు జరగనున్నాయి.

ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు కెప్టెన్‌గా హనీష్



కోగటం హనీష్

అనంతపురం: ఆర్డీటీ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-19 క్రికెట్ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే ఏపీ ప్రెసిడెంట్ జట్టు కెప్టెన్‌గా కోగటం హనీష్ వీరారెడ్డి ఎంపికయ్యాడు. ఆంధ్రా సెక్రెటరీ టీం, ఆంధ్రా ప్రెసిడెంట్ టీం, మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ విధానంలో పోటీలు జరగనున్నాయి. అనంతపురం జిల్లా నుంచి కోగటం హనీష్ వీరారెడ్డి ఒక్కరే ఈ టోర్నీకి ఎంపిక కావడం గమనార్హం.

త్వరలో సీస్ బిల్లులు జమ

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాకు పెండింగ్ ఉన్న స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే (సీస్) బడ్జెట్‌పై ఎంఈఓ-2 సంఘం నాయకులు సోమవారం విజయవాడలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డిని కలిశారు. ఎంఈఓ-2 సంఘం సలహాదారులు హెచ్.రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్.గురుప్రసాద్ కలిసి అనంతపురం జిల్లాలో 'సీస్' బిల్లులు ఎంఈఓ-2ల అకౌంట్లలో జమ కాలేదని వివరించారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే బిల్స్ సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయానికి పంపారని రామచంద్ర, గురుప్రసాద్ తెలిపారు. అనంతరం సమగ్ర శిక్ష స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగేశ్వరరావును కలిశారు. త్వరలోనే అనంతపురం జిల్లాకు చెందిన ఎంఈఓ-2లకు 'సీస్' బిల్లులు జమ అవుతాయన్నారు.